# ఈకేవైసీతో నకిలీల చెక్

## రేషన్ కార్డుల ధృవీకరణపై అదనపు కలెక్టర్ స్పష్టం



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

జిల్లాలోని రేషన్ కార్డు దారులందరూ ఈకేవైసీ పూర్తి చేయడంతో నకిలీ రేషన్ కార్డులకు పూర్తిస్థాయిలో చెక్ పడుతుందని అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే రేషన్ కార్డు తప్పనిసరిగా మారుతుందని చెప్పారు. ఆహార భద్రత చట్టం పరిధిలోని రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ఈకేవైసీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకేవైసీ ద్వారా అసలైన లబ్ధిదారులను గుర్తించి వందశాతం ప్రక్రియ పూర్తి చేసేందుకు కసరత్తు జరుగుతోందని పేర్కొన్నారు. ఈకేవైసీ కోసం రేషన్ కార్డులో పేర్లు ఉన్న కుటుంబ సభ్యులందరూ తమ వేలిముద్రలు ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. ఆయా పరిధిలోని రేషన్ దుకాణాల్లో ఈ పోస్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈకేవైసీ ప్రక్రియను వేగంగా పూర్తి చేయేందుకు సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఏఐ పుకార్లు చేసిన వ్యక్తి అరెస్ట్

## పెద్దపులి వార్తలు అవాస్తవం




**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా సీసీసీ టౌన్‌షిప్‌లో యూనియన్ బ్యాంకు సమీపంలో రాత్రి పెద్దపులి సంచరిస్తుందని ఏఐ సాంకేతికతతో నకిలీ ఫోటో రూపొందించి సోషల్ మీడియాలో పుకార్లు సృష్టించిన సాయి కిరణ్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు అటవీ క్షేత్ర అధికారి రత్నాకర్ రావు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాత్రంతా ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టినా ఎలాంటి పులి ఆనవాళ్లు లభించలేదని చెప్పారు. సీసీసీ టౌన్‌షిప్‌లోకి పెద్దపులి రాలేదని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో పులి ఫోటోను సృష్టించి సంచరిస్తున్నట్లు పోస్ట్ చేసినట్టు గుర్తించామని వివరించారు. ప్రజలను ఆందోళనలకు గురిచేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాస్తవంగా ఎవరికైనా పెద్దపులి కనిపిస్తే అటవీశాఖ, పోలీసు అధికారులకు లేదా మీడియాకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. స్పష్టత లేని పుకార్లను సోషల్ మీడియాలో వైరల్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే కేసుల బారిన పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ ఆజార్, ఎఫ్ఎస్ఓ రామకృష్ణ సర్కార్, సతీష్ పాల్గొన్నారు.



### గునుకుల కొండాపూర్ సర్పంచ్ అజయ్ వర్మకు

# ఫోటోగ్రాఫర్ల సంఘం ఘన సన్మానం

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

ఫోటోగ్రాఫర్‌గా వృత్తిని ప్రారంభించి ప్రజాప్రతినిధిగా ఎదిగిన సొల్లు అజయ్ వర్మ గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామ సర్పంచ్‌గా వరుసగా రెండోసారి అఖండ విజయం సాధించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆయనను ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ రాష్ట్ర స్థాయి ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ కరీంనగర్ జిల్లా గౌరవ సలహాదారులుగా ఉన్న సొల్లు అజయ్ వర్మను గురువారం ఘనంగా అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిరి రవి, రాష్ట్ర ముఖ్య సలహాదారులు మహిమల కేదార్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు తుమ్మ చందు, జిల్లా కోశాధికారి బి. మధుసూధన్ గౌడ్, కరీంనగర్ పట్టణ ప్రధాన కార్యదర్శి రమేష్, మల్లేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తూ ప్రజల మన్ననలు పొందిన అజయ్ వర్మ మరోసారి విజయం సాధించడం అభినందనీయమని సంఘ నేతలు పేర్కొన్నారు. ఫోటోగ్రాఫర్ వృత్తి నుంచి ప్రజాప్రతినిధి స్థాయికి ఎదగడం యువతకు ఆదర్శమని వారు తెలిపారు.

# పుష్కరాలకు ముందస్తు ఏర్పాట్లు

## భక్తులకు ఇబ్బందులు లేకుండా సమన్వయ చర్యలు : కలెక్టర్




**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

2027లో గోదావరి, 2028లో కృష్ణా పుష్కరాలను పురస్కరించుకొని నది తీర ప్రాంతాల్లో భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ చెప్పారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పుష్కరాల నిర్వహణపై రాష్ట్ర దేవాదాయ శాఖ, ఎర్నెస్ట్ అండ్ యంగ్ సంస్థ ప్రతినిధులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ అధికారి నవీన్ కుమార్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పుష్కరాల నిర్వహణపై రాష్ట్ర అధికారులు పలు సూచనలు చేశారని, ఏర్పాట్లు, సమన్వయ చర్యలపై సమీక్షించినట్లు తెలిపారు. గోదావరి పుష్కరాలు–2027, కృష్ణా పుష్కరాలు–2028లను సురక్షితంగా, సవ్యంగా, భక్తులకు అనుకూలంగా నిర్వహించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని చెప్పారు. ఈ క్రమంలో పుష్కరాల ప్రణాళిక, సమన్వయం, అమలు బాధ్యతలను ఎర్నెస్ట్ అండ్ యంగ్ సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. దేవాదాయ శాఖకు అవసరమైన సమగ్ర వివరాలను అందిస్తామని, పుష్కర ఘాట్లపై ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించినట్లు చెప్పారు. పుష్కరాల ఏర్పాట్లను సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో చర్యలు తీసుకున్నామని, ఈ ఏర్పాట్లకు సంబంధించి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌ను జిల్లా నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 11 ప్రాంతాల్లో పుష్కర ఘాట్లు ఉన్నాయని, భక్తుల సందర్శన సంఖ్య ఆధారంగా వాటిని మూడు స్థాయిలుగా విభజించినట్లు చెప్పారు. ఘాట్ల అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పుణ్యక్షేత్రాల అభివృద్ధి, ఆలయాల పునరుద్ధరణ, స్నానఘాట్ల అభివృద్ధి, రహదారులు, త్రాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, ఆరోగ్యం, భద్రత వంటి అంశాలపై సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# లాభాల వాటా చెల్లింపు సర్క్యులర్

- **విశ్రాంత ఉద్యోగుల ఆందోళనల ఫలితం**




**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

2024-25 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి సంస్థకు వచ్చిన లాభాల్లో 34 శాతం వాటాను విశ్రాంత ఉద్యోగుల వారి వారి బ్యాంకు ఖాతాల్లో తేదీ 18న గురువారం చెల్లించేందుకు సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం తెలిపింది. ఈ విషయాన్ని విశ్రాంత ఉద్యోగులందరూ గమనించాలని సంఘం కోరింది. లాభాల వాటా వెంటనే చెల్లించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన, ఆందోళన కార్యక్రమాల ఫలితంగానే 34 శాతం లాభాల వాటా చెల్లింపులకు యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందని సంఘం పేర్కొంది. అదే విధంగా తేదీ 23-12-2025న పీఎల్ఆర్ఎస్ బోనస్‌తో పాటు దీపావళి బోనస్‌ను కూడా చెల్లించేందుకు సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిపింది. విశ్రాంత ఉద్యోగులకు లాభాల వాటా, దీపావళి బోనస్ వెంటనే చెల్లించాలని నిర్వహించిన ఆందోళనలు, నిరసనలకు స్పందించిన సింగరేణి యాజమాన్యం ఈ నెల 18న లాభాల వాటా, 23న పీఎల్ఆర్ఎస్ బోనస్, దీపావళి బోనస్ చెల్లింపులకు సర్క్యులర్ జారీ చేయడంపై గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమావేశం యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ సమావేశంలో సంఘ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్యతో పాటు నాయకులు భీమ్ సేన్, అంజన్న, భిక్షపతి, బూర్ల జ్ఞాని, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# నూతన పాలకులకు సన్మానం



- **పెద్దంపేట్ గ్రామ పంచాయతీ ప్రతినిధులకు అభినందనలు**

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పెద్దంపేట్ గ్రామ నూతన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు గురువారం తన నివాసం వద్ద సన్మానించారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించడంతో, నూతనంగా సర్పంచ్‌గా ఎన్నికైన జాడి వెంకటేష్, ఉపసర్పంచ్ గాడిపెల్లి కవిత రవి తో పాటు వార్డు సభ్యులు జాడి బుచ్చమ్మ, రావుల రవీందర్, అర్క ప్రవీణ్, కొట్టాల లక్ష్మి శ్రీనివాస్, కొండగురుల అనిల్‌లను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తూ ప్రజల విశ్వాసానికి తగ్గట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు.



# డిమాండ్లు పరిష్కరించాలని వినతి



డిమాండ్లు పరిష్కరించాలని వినతి

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** కేంద్ర ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర స్థాయిలో ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలిపారు. రెండు లక్షల కోట్ల నిధులతో బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలో బీసీల సామాజిక భద్రత కోసం ప్రత్యేక బీసీ చట్టం తీసుకురావాలని పేర్కొన్నారు. రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, కాంట్రాక్టు, పారిశ్రామిక రంగాలలో కూడా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీపీ మండల్ కమిషన్ సిఫార్సులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్మల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గజ్జెల్లి వెంకటయ్య, శాఖ పూరి భీమ్సేన్, వేముల అశోక్, చంద్రగిరి చంద్రమౌళి, అంకం సతీష్, కొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం రామబాణం

శెనార్తి మీడియా, ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని విద్యా హైస్కూల్లో న్యాయవాది గటడి ఆనంద్, విద్యార్థినీ విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని తెలిపారు. గ్రామపంచాయతీ నుంచి మొదలుకొని పార్లమెంట్ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తమకు కావాల్సిన సమాచారాన్ని ఎలా రాబట్టుకోవాలో వివరించారు. సమాచార హక్కు చట్టం ద్వారా సాధించిన విజయాలను క్లుప్తంగా వివరించారు. అవినీతిని అంతం చేసేందుకు ఈ చట్టం ఎంతో దోహదపడుతుంది అన్నారు. ఈ చట్టం రామబాణం లాంటిదని తెలిపారు. దరఖాసుదారునికి కోరిన సమాచారం ఏ ప్రభుత్వ అధికారైన తప్పుడు, అసంపూర్తి సమాచారం ఇచ్చిన, సమాచారం తప్పుదోవ పడిన అధికారికి రాష్ట్ర కమిషన్ 250 నుంచి 25 వేల వరకు జరిమానా విధిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ పోవార్ ప్రవీణ్, ఉపాధ్యాయులు పట్వారి తులసి, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

